నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోండి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - భీమవరం

ప్రభుత్వ నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి డి.వెంకటరమణకు ఎస్ఎఫ్ఐ నేతలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి టి.ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలలు పుస్తకాలు, యూనిఫారాల పేర్లతో వ్యాపారం చేస్తున్నాయని పేర్కొన్నారు. పలు పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా తల్లిదండ్రుల దగ్గర నుండి వీటిపేరు చెప్పి వేలాదిరూపాయలు వసూలు చేస్తున్నారని విమర్శించారు. విద్యాశాఖ అధికారులు స్పందించి అలాంటి ప్రయివేటు పాఠశాలలను గుర్తించి వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలన్నారు. వినతిపత్రం అందించిన వారిలో పట్టణ కమిటీ సభ్యులు బి.గణేష్ ఉన్నారు.

పథకాలు భళా.. నాణ్యత డొల్ల..!

నాశిరకంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు, బాలింతలకు అందించే ఆహార పదార్థాలు

వేరుశనగ చిక్కీలు, ఖార్జురం, బెల్లంలో పురుగులు

చోడిపిండిలో ఇసుక, ముక్కినవాసనతో గోధుమ పిండి

మొదటివారంలో ఇవ్వాల్సి పాలు నెలఖారున అందజేత

వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ పథకాలపై కొరవడిన పర్యవేక్షణ

కాంట్రాక్టర్ల వ్యవహార శైలిపై సర్వత్రా చర్చ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలన్న లక్ష్యంతో అంగన్‌వాడీకేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్స్‌లోని ఆహార పదార్థాల నాణ్యత లేకపోవడంపై తీవ్ర చర్చ కొనసాగుతోంది. ఏదో ఇస్తునామన్న పేరుకే తప్ప గర్భిణులకు ఇచ్చే పోషకాహారంపై సరైన పర్యవేక్షణ లేకుండా పోయిందని చెబుతున్నారు. కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నప్పటికీ పట్టించుకునే నాథుడే లేకుండాపోయాడు. ఏలూరు జిల్లాలో తొమ్మిది ఐసిడిఎస్ ప్రాజెక్టుల పరిధిలో 2,289 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలో ఏడు ఐసిడిఎస్ ప్రాజెక్టుల పరిధిలో 1626 కేంద్రాలు పనిచేస్తున్నాయి. ఏలూరు జిల్లాలో ఎనిమిది వేల మంది వరకూ గర్భిణులు, బాలింతలు, పశ్చిమలోనూ వేలల్లో గర్భిణులు, బాలింతలున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలని ప్రభుత్వం వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ, సంపూర్ణ పోషణ ప్లస్ పథకాలను అమలుచేస్తోంది. గర్భం దాల్చిన మూడు నెలల నుంచి బిడ్డ పుట్టిన తర్వాత ఆరు నెలల వరకూ ఈ పథకం వర్తిస్తుంది. పుట్టే బిడ్డ ఆరోగ్యకరంగా పెరగాలన్న లక్ష్యంతో సంపూర్ణ పోషణ పథకం అమలు జరుగుతోంది. గర్భిణులకు, బాలింతలకు నిత్యం వండిన సంపూర్ణ ఆహారంతోపాటు, 200 మిల్లీలీటర్ల పాలు, ఉడికించిన గుడ్డు అంగన్‌వాడీ కేంద్రంలో ఇస్తారు. టేక్ హోం రేషన్ కింద వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్‌ను అందిస్తారు. అంగన్‌వాడీ కేంద్రాలకు టెట్రా మిల్క్ పాలు అందిస్తున్నారు. ఈ పాలు నిబంధనల ప్రకారం మొదటివారంలో కేంద్రాలకు చేరాలి. నిత్యం పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు పోషకాహారంతోపాటు, పాలు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ పాలు ఈ నెలఖారున 29, 30 తేదీల్లో ఇస్తున్నారు. దీంతో నిత్యం గర్భిణులకు, బాలింతలకు పాలు అందడం లేదు. గుడ్డు కూడా సక్రమంగా ఇవ్వడం లేదు. నిబంధనల ప్రకారం గుడ్డు 50 గ్రాములు ఉండాలి. కాంట్రాక్టర్లు 25 గ్రాముల బరువుగల గుడ్లను సరఫరా చేస్తున్నా అడిగే నాథుడే లేకుండా పోయాడు. కొన్నిసార్లు పాడైన గుడ్లు సరఫరా చేస్తున్నారు. అయినప్పటికీ అధికారులెవ్వరూ పట్టించుకున్న పరిస్థితి లేదు. పోషకాహారంలో భాగంగా అందించే వస్తువుల నాణ్యతపై అంగన్‌వాడీ ఉద్యోగులు నెత్తీనోరు బాదుకుంటున్నప్పటికీ పరిస్థితిలో మాత్రం మార్పు రావడంలేదని తెలుస్తోంది.

నాణ్యతలేని వైఎస్ఆర్ సంపూర్ణ పోషక ప్లస్ కిట్స్

గర్భిణులకు, బాలింతలకు ఇంటికి పోషకాహారం అందిచడంలో భాగంగా వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ ప్లస్ కిట్లను ప్రభుత్వం అందిస్తోంది. ఈ కిట్లలో ఐదు రకాల ఆహార పదార్థాలను ఇస్తున్నారు. మల్టీగ్రైన్ గోధుమపిండి రెండు కిలోలు, బెల్లం అరకేజీ, వేరుశెనగ చిక్కీలు అరకేజీ, ఎండుఖర్జూరం అరకేజీ, రాగి పిండి అరకేజీ ఇస్తున్నారు. వీటిలో ఏ ఒక్క ఆహార పదార్థంలోనూ నాణ్యత ఉండటంక లేదని లబ్ధిదారులు చెబుతున్నారు. వేరుశెనగ చిక్కీల్లో, ఎండు ఖర్జూరంలో పురుగులుంటున్నాయి. రాగిపిండిలో ఇసుక ఎక్కువగా ఉండటంతో తినలేకపోతున్నామని చెబుతున్నారు. గోధుమ పిండి ముక్కినవాసన రావడం, బెల్లం పులుపుగా ఉండి, పురుగులుంటున్నాయని పలువురు వాపోతున్నారు. ఏ ఒక్క ఆహార పదార్థం కూడా నాణ్యత లేకపోవడంతో పట్టుకెళ్లిన కిట్లను వాడకుండాక పడేస్తున్నారు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరకపోగా, ప్రజాధనం వృథా అవుతోంది. ఇంత పెద్దమొత్తంలో నిధులు ఖర్చుచేసి అందిస్తున్న పోషకాహారంపై కనీస పర్యవేక్షణ లేకపోవడం ఏమిటో ఏ ఒక్కరికీ అర్థంకావడం లేదు. కాంట్రాక్టర్లు రాజకీయ నాయకులతో సన్నిహితంగా ఉంటూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం, జిల్లా అధికారులు గర్భిణులకు, బాలింతలకు ఇచ్చే పోషకాహారంపై దృష్టిసారించాలని అంతాకోరుతున్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

నారుమళ్లకు పూర్తిస్థాయిలో నీరు : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

కాలువలకు నీటి విడుదలను సమన్వయం చేస్తూ నారుమళ్లకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించాలని కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు కైగాల శ్రీనివాసరావు అధ్యక్షతన వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం నరసాపురం కాలువకు నాలుగు వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశామన్నారు. సెంటు భూమికి కూడా నీటి ఇబ్బంది లేకుండా చూస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ఖరీఫ్ పంటకాలంలో 96,075 హెక్టార్లలో వివిధ పంటల సాగుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. వాటిలో వరి 95,600 హెక్టార్లు, అపరాలు 60 హెక్టార్లు, చెరకు 400 హెక్టార్లు, వేరుశనగ 15 హెక్టార్లు ఉన్నాయన్నారు. ఖరీఫ్ సాగుకు సాగుకు 5,25,800 మెట్రిక్ టన్నులు ధాన్యం ఉత్పత్తి అంచనా వేశామన్నారు. ఇప్పటికే కాలువలకు నీటిని విడుదల చేశామని, శివారు ఆయకట్టు రైతాంగం మధ్యకాలిక వరి రకాలైన ఎంటియు విత్తనాలు 1061, 1064, 7029 సూచించామన్నారు. గడిచిన రబీలో 74,129 మంది రైతుల నుండి 6,43,868 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. దీని నిమిత్తం రైతులకు రూ.1313.72 కోట్లు చెల్లించాల్సి ఉండగా, నేటి వరకూ రూ.1250.67 కోట్లు అంటే 95 శతం చెల్లింపులు పూర్తిచేశామన్నారు. ఇంకా చెల్లించాల్సిన మొత్తం రూ.63.05 కోట్లు త్వరలో రైతుల ఖాతాల్లో జమ చేస్తామన్నారు. బ్యాంక్ అకౌంట్‌లో వ్యత్యాసాలు తదితర కారణాల వల్ల చెల్లింపుల్లో జాప్యం జరుగుతుందన్నారు. అలాగే గన్ని బ్యాగులు, హమాలీలు, రవాణా ఖర్చుల కింద రూ.43.47 కోట్లు చెల్లించాల్సి ఉండగా, నేటివరకూ 34.18 కోట్లు చెల్లించామని, ఇంకా రూ.9.29 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. రైతు నేల స్వభావాన్ని బట్టి అనుకూలమైన పంటను విత్తేందుకు జిల్లాలో మొత్తం 15,014 మట్టి నమూనాలను సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించా మన్నారు. పరీక్షల ఫలితాలను జూన్, జూలైలో అందజే స్తామని తెలిపారు. జిల్లాలో రైతుల నుండి వచ్చిన విజ్ఞప్తుల మేరకు 1,737 క్వింటాళ్ల వరి విత్తనాలను ఆర్‌బికెల ద్వారా కేజీ రూ.ఐదు చొప్పున సబ్సిడీపై అందించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. దీంతోపాటు ఇప్పటికే 239 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలను 50 శాతం రాయితీపై రైతాంగానికి సరఫరా చేశామని చెప్పారు. రాబోయే వాతావరణ మార్పులకు అనుగుణంగా ముందస్తుగా నాట్లు నారుమళ్లను వేగవంతంగా వేసి, జూలై ఆఖరు నుండి ఆగస్టు మొదటి వారంలోగా నాట్లు పూర్తి చేసుకోవాలనే లక్ష్యంతో ఆర్‌బికెల ద్వారా రైతాంగాన్ని ప్రోత్సహించే కార్యక్రమం చేపట్టామన్నారు. సార్వాలో 95 ఆర్‌బికెల పరిధిలో రూ.19.48 లక్షల వ్యయంతో పొలంబడి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం కమిటీ ఛైర్మన్ శ్రీనివాస్‌రావు, కమిటీ సభ్యులు పెనుమత్స దుర్గాప్రసాద్ రాజు, కొట్టు కుటుంబరావు మాట్లాడారు.

అనంతరం డిసిసి, డిఎల్ఆర్‌సిల బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ కౌలు రైతులకు భరోసా కల్పించేలా సిసిఆర్‌సి కార్డుల మంజూరుతో పాటు, పంట రుణాలను కూడా అందజేయాలని అధికారులను, బ్యాంకర్లను ఆదేశించారు. వాస్తవంగా పంటలు సాగు చేసేవారు 90 శాతం మంది కౌలు రైతులేనని తెలిపారు. తహశీల్దార్లు ఆర్‌బికెల వారీగా గ్రామసభల షెడ్యూల్‌ను విడుదల చేయాలన్నారు. విఎఒ, విఆర్‌ఒల ఆధ్వర్యంలో రైతులకు సిసిఆర్‌సి కార్డులను ఇప్పించేందుకు భూ యజమానులకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. 2023-24 సంవత్సరానికి జిల్లా జిల్లాలో 57,500 సిసిఆర్‌సి కార్డులు మంజూరు చేయాలని లక్ష్యంగా నిర్ణయించామన్నారు. కార్డుల జారీతోనే ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా, రైతు భరోసా వంటి పథకాల అమలుకు వీలవుతుందన్నారు. జిల్లా రుణ ప్రణాళిక మొత్తం రూ.12,496 కోట్లు కాగా దీనిలో పంట రుణాలు కోసం రూ.7,080 కోట్లు, దీర్ఘకాలిక, మధ్యకాలిక రుణాల కోసం 5,646 కోట్లు లక్ష్యంగా ఈ ఏడాది నిర్ణయించామన్నారు. టిడ్కో గృహాల లబ్ధిదారులకు రుణాల మంజూరులో జాప్యం జరుగుతుందని దీనిపై బ్యాంకర్లపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి, జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, యుబిఐ రీజనల్ హెడ్ పి.సంగీత కుమారి, లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ ఎ.నాగేంద్ర ప్రసాద్, ఆర్‌బిఐ మేనేజర్ ఎ.నాగప్రవీణ్, అధికారులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా పారదర్శకంగా ఉండాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

ఓటర్ల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

ఓటర్లు తుది జాబితాకు అనుగుణంగా ఓటర్లు ఉన్నారా లేరా అని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి క్షేత్రస్థాయిలో శుక్రవారం తనిఖీ చేశారు. సూర్యనారాయణపురంలో ఓటర్లు జాబితాకు అనుగుణంగా ఒకే ఇంటి నెంబర్‌తో పది ఓటర్లకు మించి ఉన్న గహాలను సంబంధిత అధికార యంత్రాంగంతో స్వయంగా వెళ్లి కలెక్టర్ ఆరా తీశారు. ఓటర్ల జాబితా ప్రకారం ఓటర్లు అయా పోలింగ్‌బూత్ పరిధిలో ఉన్నారా లేదా అన్న వివరాలు నేరుగా వారినే అడిగి తెలుసుకున్నారు. వివాదాలకు తావు లేకుండా జాబితాలుండాలని బిఎల్ఒలను జిల్లా కలెక్టరు ఆదేశించారు. మరణించిన వారిని ఓటర్ల జాబితా నుంచి తొలగించాలని సూచించారు. పారదర్శకంగా ఓటర్ల జాబితా సవరణ చేయాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం ఉండకూడదని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాలతో పకడ్బందీగా జాబితా సవరణ చేసి, బోగస్ ఓటర్లపై దృష్టి సారించాలని తెలిపారు. ఒకరికి రెండు చోట్ల ఓటు హక్కు ఉన్నా వాటిని తొలగించే బాధ్యత కూడా బూత్ లెవిల్ అధికారులదేనన్నారు. తహశీల్దారు వై.రవికుమార్, మున్సిపల్ కమిషనరు ఎస్.శివరామకృష్ణ, బిఎల్ఒలు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు రోజుకూలి రూ.600 ఇవ్వాలి

ప్రజాశక్తి - గణపవరం



కూలీల సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

పెరిగిన ధరలకు అనుగుణంగా ఉపాధి హామీ కూలీలకు ప్రభుత్వం రోజు కూలి రూ.600 ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, సిఐటియు మండల కార్యదర్శి పి.గోవిందు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పిప్పర శివారు కొండాలమ్మ ఆలయ సమీపంలో పనిచేస్తున్న ఉపాధి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు తగ్గించడం దారుణమన్నారు. గతంలో ఉన్నపనిముట్లు టెంట్లు, తాగునీరు, మెడికల్ కిట్లు, సమ్మర్ అలెవెన్సులు కొనసాగించాలన్నారు. రెండు పూటలా ఫొటో, మస్తరు విధానం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో పిట్టా బాబూరావు, ముప్పిడి శామ్యూల్, ముప్పిడి సుగుణ పాల్గొన్నారు.

కొనసాగిన పెరుగులంక దళితుల దీక్ష

ప్రజాశక్తి - యలమంచిలి

దీక్షలో పాల్గొన్న దళితులు

చించినాడ పెరుగులంక భూముల్లో మట్టి అక్రమ తవ్వకాలను వ్యతిరేకిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలు శుక్రవారం కూడా కొనసాగాయి. ఈ దీక్షలకు సిఐటియు సంఘీభావం తెలిపింది. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి దేవ సుధాకర్ మాట్లాడుతూ జగనన్న లే అవుట్లలో మట్టిని పూడ్చడానికి కేవలం చించినాడలోని దళితుల భూములే కావాల్సి వచ్చాయా అని ప్రశ్నించారు. అడ్డొచ్చిన పేదలపై పోలీసుల చేత క్లారిటీ ఛార్జి చేయించడం అమానుషమని ప్రభుత్వం మట్టి తవ్వకాలు ఆపాలని విజ్ఞప్తి చేశారు. ఈ దీక్షలో నాయకులు బాతిరెడ్డి జార్జి, సరిపల్లి జయప్రభ, మురాల జైసింగ్, విప్పర్తి నన్ని, వాసు పాల్గొన్నారు.

మట్టి తవ్వకాలు ఆపకపోతే ఉద్యమం

పాలకొల్లు: చించినాడలో దళితుల భూముల్లో ప్రభుత్వం మట్టి తవ్వకాలు ఆపకపోతే దళితుల సత్తా చూపిస్తామని టిడిపి జిల్లా ఎస్‌సి సెల్ కార్యదర్శి పీతల శ్రీనివాస్ విమర్శించారు. చించినాడలో మట్టి తవ్వకాలపై శుక్రవారం పాలకొల్లులో ఆయన మీడియాతో మాట్లాడారు. నియోజకవర్గంలో ఇతర అవసరాలకు మట్టి తరలిపోతోందని, దళితులు ఎన్ని ఆందోళనలు చేసినా ప్రభుత్వం దళితులకు చెందిన భూమిని తీసుకెళ్తోందని విమర్శించారు. వందల ఎకరాల్లో మట్టి ఇళ్ల స్థలాల పూడిక, రియల్ ఎస్టేట్ అనేక అవసరాలకు తరలిపోతుందని తెలిపారు. ఈ మట్టిని తీసుకోకుండా ప్రభుత్వం దళితుల భూమిని తీసుకోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. దళితుల పట్ల ప్రభుత్వం అలంబిస్తున్న వైఖరికి నిరసనగా త్వరలో పెద్ద ఎత్తున దళితులు ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

ఖాళీ బిందెలతో మహిళల నిరసన

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

ఖాళీ టిన్నులతో నిరసన వ్యక్తం చేస్తున్న తాడేపల్లిగూడెం టిడ్కో ఇళ్ల మహిళలు

నరసాపురం పట్టణం 25వ వార్డు ఆదర్శనగర్ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ స్థానిక మహిళలు కాలనీలో ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కవురు పెద్దిరాజు మాట్లాడుతూ మూడు నెలలుగా కాలనీలో కుళాయి నీరు సక్రమంగా రావడంలేదన్నారు. ట్యాంకర్ల ద్వారా పంపుతున్న నీరు పచ్చరంగులో ఉండి తాగడానికి పనికిరావడంలేదని తెలిపారు. కుళాయి పన్ను కడుతున్న తమకు ఇదేం ఖర్మని వాపోయారు. పైపులైన్లు మరమ్మతులు చేసి సక్రమంగా నీరు అందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కొత్త పైపులైను వేయాలని కోరారు. రెండు రోజుల్లో సమస్య పరిష్కారం కాకపోతే మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కడలి బేబి, యడ్లపల్లి జాన్సీ, బండి వరలక్ష్మి, పాలా జ్యోతి, భవానీ, లక్ష్మి, కుమారి, మెర్సీ, శ్యామల పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: తాగునీరు సరిగ్గారాక చాలా ఇబ్బందులు పడుతున్నామని తాడేపల్లిగూడెం టిడ్కో గృహాల్లో నివాసం ఉంటున్న మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తూ శుక్రవారం ఖాళీ టిన్నులతో నిరసన తెలిపారు. అద్దె ఇళ్లల్లో ఉంటున్న తమకు సొంతిల్లు ఆశ చూపించి అడవిలో వదిలేశారని వాపోతున్నారు. తాడేపల్లిగూడెంలోని టిడ్కో ఇళ్లల్లో సుమారు 600 కుటుంబాలు నివశిస్తున్నాయన్నారు. తమకు వారానికి రెండుసార్లు కంటి తుడుపు చర్యగా వాటర్ ట్యాంకును తిప్పితున్నారని, ఆ నీరు సరిపోక వాటర్ టిన్నులు కొనుక్కుని తాగాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు. టిన్ను కొనుగోలుకు రూ.20 వెచ్చించాల్సి వస్తోందని వాపోయారు. వాటితో పాటు చెత్త వాహనం వారానికి రెండు రోజులు మాత్రమే వస్తుందని, అందువల్ల చెత్త ఇళ్లలోనే పేరుకు పోతోందన్నారు. దీనికితోడు పాములు సంచరిస్తున్నాయని, చంటి పిల్లలతో ఉన్నందున ఎప్పుడూ ఏ అపాయం ముంచుకొస్తుందోనని ఆందోళన చెందుతున్నామని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాలని మహిళలు వేడుకుంటున్నారు.

నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు

నిప్పుల కొలిమి..

ప్రజాశక్తి - పాలకొల్లు

గత 3 రోజులుగా ఎండ ప్రభావం తీవ్రంగా ఉంది. రోజురోజుకూ పట్టణంలో నిప్పుల వాన వలే ఎండ ఉండడంతో మధ్యాహ్న సమయంలో రోడ్లు నిర్మానుష్యంగా ఉంటున్నాయి. శుక్రవారం పట్టణంలో 44 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో కర్ఫ్యూ వాతావరణం వలే ఉండటంతో షాపులు సైతం కట్టేస్తున్నారు. చిరు వ్యాపారులు గత వారం రోజులుగా మధ్యాహ్నం అమ్మకాలు చేయక ఇంటి వద్దే ఉంటున్నారు.

పాలకొల్లు రూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో నిప్పుల కొలిమిని తలపించేలా వడగాల్పులు వీచాయి. సుమారు 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ విపరీతమైన వడగాల్పులకు ప్రజలు బయటకు రాలేక ఇంటిలో ఉండలేక ఇబ్బంది పడ్డారు. ఇంట్లో ఉన్న వస్తువులు, నీళ్లు సైతం వేడెక్కిపోయి ప్రజలు ఇబ్బంది పడ్డారు. కూలి పనులు చేసుకునే వారు, వీధి వ్యాపారులు మొదలైన వారు ఎండ వేడిమిని తట్టుకోలేక విలవిల్లాడిపోయారు. వర్షాల కోసం ప్రజలు, రైతులు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు.

విద్యార్థులు బాగా చదువుకోవాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

విద్యార్థులకు మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఆర్‌డిఒ

విద్యార్థులు ఉన్నతంగా చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధిస్తే తల్లిదండ్రులకు, ఆయా కళాశాలకు ఎంతో గౌరవమని ఆర్‌డిఒ దాసి రాజు అన్నారు. భీమవరం సిఎస్ఎన్ డిగ్రీ, పీజీ కళాశాలలో ప్రతిభ చాటిన విద్యార్థులకు శ్రీవిజ్ఞానవేదిక, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆయన కార్యాలయంలో మెడల్స్, ప్రశంసా పత్రాలను ఆర్‌డిఒ దాసి రాజు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ తల్లిదండ్రులు ఎంతో నమ్మకం పెట్టుకుంటారని, అందువల్ల చదువు పట్ల విద్యార్థులు శ్రద్ధ వహించాలని అన్నారు. ఆడ పిల్లలు చదువులో ముందడుగులో ఉంటున్నారని, బాలురులు కూడా ముందంజలో ఉండాలని అన్నారు. కళాశాల సెక్రటరీ డాక్టర్ చీడే సత్యనారాయణ, ప్రిన్సిపల్ సకుమళ్ల సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతిభ కలిగిన, పేద విద్యార్థులకు కళాశాల ఎల్లప్పుడూ సహాయ సహకారాలను అందిస్తుందని తెలిపారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ సిఎస్ఎన్ కళాశాలలో బిఎ, బికాం, బిఎస్‌సిలో ప్రతిభ కనబర్చిన వారికి మెడల్స్, ప్రశంసాపత్రాలను అందజేశారు. అనంతరం ఆర్‌డిఒను కళాశాల యాజమాన్యం సత్కరించింది. కార్యక్రమంలో కంతేటి వెంకట్రాజు, బొమ్మదేవర ప్రభాకర్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు నందమూరి రాజేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదర్శ ఉద్యోగులకు నగదు ప్రోత్సాహకాలు అందజేత

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం బస్ డిపోలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఆదర్శ ఉద్యోగుల అభినందన సమావేశంలో జిల్లా రవాణాధికారి ఎ.వీరయ్య పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన కండక్టర్ ఆచార్యులు, డ్రైవర్లు డిఎస్.రావు, కెవి.రత్నంను అభినందించి వారికి నగదు బహుమతి, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిపోలో ఈ మధ్యకాలంలో హైదరాబాద్ రూట్‌లో ప్రవేశపెట్టిన ఇంద్ర ఏసి, ఆచంట రూట్‌లో అదనపు బస్సులను ప్రజాదారణ పొందేలా నడపాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి, గేరేజి, ట్రాఫిక్, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఐసిడిఎస్ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీల ధర్నా

ప్రజాశక్తి - ఆకివీడు

అంగన్‌వాడీలకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు అమలు చేయాలని అంగన్‌వాడీ హెల్పర్స్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు కె.మార్తమ్మ, పట్టణ అధ్యక్షులు కె. తవిటినాయుడు డిమాండ్ చేశారు. తమ కోర్కెల సాధనలో భాగంగా స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద శుక్రవారం కొద్దిసేపు ధర్నా చేపట్టారు. అనంతరం ఐసిడిఎస్ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్.శాంతకుమారి, కె.పావని, డి.కాళీ, ఐ.లక్ష్మీకుమారి, కె.సంధ్య పాల్గొన్నారు.

కౌలు కార్డులు జారీ చేయాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

జిల్లాలో కౌలు కార్డుల జారీలో కొందరు రెవెన్యూ ఉద్యోగులు కౌలు రైతులను తీవ్ర ఇబ్బందులు గురి చేస్తున్నారని కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు కూసంపూడి సుబ్బరాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ఈ కార్డుల జారీ ప్రక్రియ నత్తనడకగా సాగుతుందని తెలిపారు. మండలంలోని ఒక పెద్ద పంచాయతీలో కౌలు కార్డు జారీకి రూ.వంద నుంచి రూ.150 డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. ఇటీవల మంగళగిరి సిసిఎల్ఎ కార్యాలయం వద్ద కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో రైతులు అధికారులను కలిసిన సందర్భంలో 'మీరు దరఖాస్తులు పెట్టుకోండి, అర్హులైన ప్రతి ఒక్కరికీ కౌలు కార్డులు ఇస్తామని హామీ ఇచ్చారని' తెలిపారని పేర్కొన్నారు. కానీ కౌలు కార్డుల కోసం గ్రామ రెవెన్యూ అధికారి చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి ఉందని తెలిపారు. కౌలు కార్డుల జారీ ప్రక్రియ వేగవంతం చేయడంతో పాటు సకాలంలో బ్యాంకు రుణాల అందే విధంగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కౌలు రైతుల నుండి డబ్బులు డిమాండ్ చేస్తున్న వ్యవహారంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నేడు జగనన్న విద్యా కానుక అందజేత

ప్రజాశక్తి - అత్తిలి

ఈ నెల 17వ తేదీన రెండు హైస్కూళ్లలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక సామగ్రిని అందజేస్తున్నట్లు ఇన్‌ఛార్జి ఎంఇఒ డి.శారదాజ్యోత్స్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొమ్మర, అత్తిలి బాలుర హైస్కూల్‌లో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక సామగ్రిని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చేతులు మీదుగా అందించనున్నట్లు తెలిపారు. ఆయా హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

ప్రజాశక్తి - కాళ్ల

ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతోపాటు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని పిహెచ్‌సి వైద్యాధికారి ఎం.గులాబ్ రాజ్ కుమార్ అన్నారు. కోమటిగుంట గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. పిహెచ్‌సి, 104 వైద్య సిబ్బందితో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. షుగర్ 45 మందికి, బిపి 40 మందికి, జనరల్ 75 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి బోణం భాగ్యశ్రీ శివకుమార్, హెచ్‌వి.పరంజ్యోతి, ఎఎన్‌ఎం కృష్ణకుమారి, ఎంఎల్‌హెచ్‌పి.భారతి పాల్గొన్నారు.

పాలమూరులో జన్ భాగీదారి

ప్రజాశక్తి - పెనుమంట్ర

విద్యార్థులకు ఆట, పాటలతో కూడిన విద్య ప్రీ స్కూల్‌లో ఉంటుందని ఐసిడిఎస్ సిడిపిఒ మేరీ ఎలిజిబెత్ అన్నారు. జన భాగీదారి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పాలమూరులో కోడ్ నెంబర్-25 ఎల్.కుమారి అంగన్‌వాడీ సెంటర్‌లో గ్రామ స్థాయిలో విద్యార్థులు, తల్లిదండ్రులతో ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ మేరీ ఎలిజిబెత్ మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్లో ప్రీస్కూల్ విద్యనందించడమే కాకుండా వారికి కావాల్సిన పౌష్టికాహారం అందించడం జరుగుతుందని తెలిపారు. అలాగే తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేలా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ సుజాత, అంగన్‌వాడీ టీచర్లు ఆదిలక్ష్మి, డి.మౌలిక పాల్గొన్నారు.

ప్రభుత్వం మత్స్యకారులను మభ్యపెడుతోంది : జనసేన

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

మత్స్యకారులను జగన్ ప్రభుత్వం మభ్యపెడుతోందని జనసేన నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొమ్మిడి నాయకర్ అన్నారు. స్థానిక జనసేన కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి పిఎసి సభ్యులు, రాష్ట్ర మత్స్యకార వికాస విభాగ ఛైర్మన్ బొమ్మిడి నాయకర్ విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మత్స్యకారులకు మేలు చేశామని చెప్పుకుంటున్న వైసిపి ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. ఫిషింగ్ హార్బర్ నిర్మాణం అంటూ గాల్లో పేక మేడలు కట్టారన్నారు. పవన్ కళ్యాణ్‌ను విమర్శిస్తున్న మంత్రులు నోరు అదుపులో పెట్టుకోవాలని లేకపోతే తగిన మూల్యం చెల్లించిక తప్పదన్నారు. ఈ నెల 24, 25వ తేదీల్లో జరగబోయే వారాహి యాత్రను జనసేన నాయకులు, అభిమానులు జయప్రదం చేసి విజయవంతం చేయాలని కోరారు. రాబోయే కాలంలో పవన్ సిఎం అవ్వడం ఖాయమన్నారు. పవన్ కళ్యాణ్ మాత్రమే మత్స్యకారులకు తగిన న్యాయం చేస్తారని తెలిపారు. అనంతరం వారాహి యాత్ర పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, జన సైనికులకు, వీర మహిళలు పాల్గొన్నారు.

ఉత్తమ గ్రేడ్లు సాధించిన విద్యార్థుల్లో కళాశాల పాలకవర్గం

ఛాంబర్స్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - పాలకొల్లు

ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ డిగ్రీ 5వ సెమిస్టర్ ఫలితాల్లో ఛాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు అన్ని గ్రూపుల్లో అత్యుత్తమ గ్రేడ్స్ సాధించి మరోసారి చరిత్ర సృష్టించారు. బిఎస్‌సి ఫలితాల్లో పి.సత్యదుర్గ 9.8 గ్రేడ్, బి.కిన్నెర భ్రమరాంబ 9.8, డి.మహాలక్ష్మి 9.8, జి.రేఖ 9.7, ఆర్.హారిక, బి.మేఘన విరితశ్రీ 9.6, పి.హెన 9.6, పి.సాయి నవీన్ 9.6, పి.మౌనిక 9.6, ఎ.మల్లీశ్వరి 9.6, ఎస్.కేశవర్ధిని 9.6, టి.కళ్యాణి 9.6, పి.సాయి దిలీప్ 9.5, సలోమి జ్యోతి 9.5, డి.శ్రావణి శ్రీప్రియ 9.3 గ్రేడు పాయింట్లు సాధించారు. డి.సౌజన్య 9.2, కె.గణేష్ 9.2, ఎంవి మౌనిక 9.2, సిహెచ్.పట్టాభి 9.1, టిసిఎస్ షణ్ముఖ 9.1 గ్రేడ్ పాయింట్లు సాధించారు. అలాగే బికాం, బిబిఎలో ఉత్తమ ఫలితాలు సాధించారని ప్రిన్సిపల్ తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను యాజమాన్యం అభినందించింది.

వీరబ్రహ్మంకు సత్కారం

ప్రజాశక్తి - మొగల్తూరు



వీరబ్రహ్మంను సత్కరిస్తున్న గ్రామస్తులు

మండలంలోని పేరుపాలెంనార్త్‌కు చెందిన సిద్ధాంతి ఆముదాలపల్లి వీరబ్రహ్మం శుక్రవారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఇటీవల గ్రామంలో తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన శ్రీవాణి ట్రస్టు ద్వారా మంజూరైన రూ.10 లక్షలతో ఎస్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో కుంతీ మహేశ్వరి, నంది ఆలయాన్ని నిర్మించారు. ఆలయ నిర్మాణానికి ప్లాను, ముహూర్తం వీరబ్రహ్మం అందజేశారు. ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా వీరబ్రహ్మం ఆర్థిక సహకారంతో అన్నసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను గ్రామస్తులు సత్కరించారు.

18న విఎస్‌కెలో స్కాలర్‌షిప్ టెస్ట్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఈ నెల 18వ తేదీన ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణత సాధించిన వారికి భీమవరం విఎస్‌కె డిగ్రీ కళాశాలలో స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు కళాశాల సెక్రటరీ వి.పట్టాభిరామయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిభావంతులను పేద విద్యార్థులను ప్రోత్సహించాలనే తలంపుతో రూ.3 లక్షల స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ టెస్ట్‌లో ఉత్తీర్ణత సాధించిన వారికి ఈ స్కాలర్‌షిప్‌ను యాజమాన్యం తరుపున అందజేస్తామని తెలిపారు. ఫీజు రీయింబర్స్ మెంట్ పథకం ఎంతో మంచిదని, కానీ నేరుగా కళాశాలకు పంపడం వల్ల కళాశాలలకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రిన్సిపల్ ఎబి.రమణ మాట్లాడుతూ విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి తమ యాజమాన్యం ఈ విధమైన స్కాలర్ షిప్ టెస్ట్ నిర్వహిస్తోందని తెలిపారు. ఈ నెల 18 ఉదయం 11 గంటలకు విఎస్‌కె డిగ్రీ కళాశాలలో జరుగుతుందని తెలిపారు. ఇంటర్ పాసైన విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి పాల్గొన్నారు.

విద్యార్థులకు కళ్లజోళ్లు అందజేత

ప్రజాశక్తి - గణపవరం

కంటి వెలుగులో భాగంగా గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి కళ్ల జోళ్లు అందజేశారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి పుచ్చల శేషు మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ పథకాలతోపాటు విద్యార్థుల ఆరోగ్య విషయంలో కూడా శ్రద్ధ తీసుకుంటోందన్నారు. కంటి వెలుగు కార్యక్రమంలో కంటి పరీక్షలు చేయించుకున్న విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా కళ్లజోళ్లు అందిస్తోందన్నారు. బాలికల హైస్కూల్లో 35 మందికి, బాలుర హైస్కూల్లో 19 మందికి కళ్లజోళ్లు అదజేశారు. ఈ కార్యక్రమంలో పి.సంతోషనాయుడు, సిహెచ్‌ఒ జాలాది విల్సన్‌బాబు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఉత్తర్వులిచ్చినా నాన్చుడే..!

బోర్డుకే విఇసి జూనియర్ కళాశాల పరిమితం
యాజమాన్యం ఒత్తిడికి లొంగిపోయిన ఆర్‌జెడి!
ప్రభుత్వ కళాశాలగా మార్పు చేస్తూ ఉత్తర్వులిచ్చేదెప్పుడు..?
అధికారి తీరుతో స్థానికుల ఆగ్రహం

వీరవాసరం విఇసి జూనియర్ కళాశాల

ప్రజాశక్తి - వీరవాసరం

ఎయిడెడ్ కళాశాలలను రద్దు చేస్తూ ప్రభుత్వం జిఒ తీసుకొచ్చినా వీరవాసరం విఇసి జూనియర్ కళాశాలను ప్రభుత్వ జూనియర్ కళాశాలగా మార్పు చేస్తూ ఉత్తర్వులివ్వడంతో ఇంటర్ మీడియట్ కమిషనర్ నాన్చుడి ధోరణి అవలంబించడంతో స్థానికంగా ఆగ్రహం వ్యక్తమవుతోంది. కళాశాలను ప్రభుత్వ కళాశాలగా మార్పు చేసేందుకు ఎటువంటి అభ్యంతరమూ లేదని కళాశాల యాజమాన్యం అంగీకారం తెలిపింది. గత సంవత్సరం ఇందుకు సంబంధించిన ప్రక్రియలో భాగంగా కళాశాల ఆస్తులను, బ్యాంకు ఖాతాలను పరిశీలించి ఆర్‌జెడి యాజమాన్యం నుంచి అంగీకార పత్రం తీసుకున్నారు. అయినప్పటికీ ఇప్పటివరకూ ప్రభుత్వం జూనియర్ కళాశాలగా మార్పు చేస్తూ ఆర్‌జెడి నివేదిక అనుసరించి ఇంటర్మీడియట్ బోర్డు నుంచి ఏ విధమైన తుది ఉత్తర్వులు విడుదల చేయలేదు. దీంతో కమిషనర్ వైఖరి పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విఇసి కళాశాల పేరును తన తండ్రి పేరుతో మార్పు చేయాలని యాజమాన్యం అభ్యర్థించడంతో అందుకు అనుగుణంగా ఆర్‌జెడి సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే యాజమాన్యం అభ్యర్థన నిబంధనలకు విరుద్ధంగా ఉండడంతో ఆర్‌జెడి నివేదిక ప్రకారం తుది ఉత్తర్వులు ఇవ్వడంలో కమిషనర్ నాన్చుడి ధోరణి అవలంబిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం విఇసి జూనియర్ కళాశాల స్థలం ప్రభుత్వానికి చెందింది. ఇక్కడ నిర్మించిన భవనాలన్నీ ఎంపీ ల్యాండ్స్ నిధుల నుంచి సమకూరినవి. ప్రస్తుత యాజమాన్యం నయాపైసా కూడా కళాశాలకు వెచ్చించిన దాఖలాల్లేవు. అటువంటిది కళాశాల పేరును యాజమాన్యం కోరినట్టుగా ఏవిధంగా మార్పు చేస్తారంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఒక పక్క విఇసి జూనియర్ కళాశాలగా మార్పు చెందినట్లు నమ్మబలికే విధంగా కళాశాల ముందర విఇసి ప్రభుత్వం జూనియర్ కళాశాల పేరుతో బోర్డు ఏర్పాటు చేసి అందుకు అనుగుణంగా ఇది ప్రభుత్వం కళాశాలంటూ విద్యార్థులు చేరాలంటూ ప్రచారం చేయడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్థలంలో ప్రజలు చందాలు వేసుకుని ఏర్పాటు చేసుకున్న ఈ జూనియర్ కళాశాల పేరును ఒక వ్యక్తికి అనుకూలంగా ఎలా మార్పు చేస్తారంటూ అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. యాజమాన్యానికి ప్రభుత్వంలో ఉన్న పలుకుబడిని ఉపయోగించుకుని తమకు అనుకూలంగా పేరు మార్పు చేయించుకోవాలని ఆర్‌జెడిపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే దాన్ని వచ్చే ఎన్నికల్లో ఈ అంశాన్ని ఒక అస్త్రంగా వాడుకుని ప్రభుత్వ వైఖరిని తప్పుపడుతూ రాజకీయంగా వాడుకుని స్థానికంగా లబ్ధిపొందాలన్నది ప్రతిపక్షాల ప్రయత్నంగా ఉంది. విద్యా సంవత్సరం ప్రారంభం దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వ కళాశాలగా మార్పు చేస్తారా చేయరో సందిగ్ధం నెలకొంది. ఈ నేపథ్యంలో కళాశాలకు సంబంధించి కమిషనర్ తుది ఉత్తర్వులు ఇవ్వకపోతే కళాశాలకు కలిగే నష్టం పట్ల విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు ఉద్యమించడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశాయి.



ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వము, రెవిన్యూ శాఖ
భూమి రికార్డుల వివరములు
పట్టాదారుని అడంగలు

మండలం పేరు : వీరవాసరం
విస్తీర్ణం యూనిట్లు : ఎకరములు / సెంట్లు

వరుస సంఖ్య (1)	సర్వే నెం (2)	పూర్తి విస్తీర్ణం (3)	సాగుకు పనికి రాని విస్తీర్ణం (4)	సాగుకు పనికి వచ్చు విస్తీర్ణం (5)	భూమి స్వభావం (6)	శిస్తు (రూ.) (7)	భూమి వివరణ (8)	జలాధారము (9)	ఆయకట్టు విస్తీర్ణం (10)	ఖాతా నెంబరు (11)	పట్టాదారు పేరు (తండ్రి/భర్త పేరు) (12)	అనుభవదారు పేరు (తండ్రి/భర్త పేరు) (13)	అనుభవ విస్తీర్ణం (14)	[illegible]
	541-2	1.6300	1.6300	0.0000	ప్ర.భూమి	0.00	ప్ర.భూమి	వర్తించదు	1.6300	20000102	ప్రభుత్వ భూమి	బంగళా	1.6300	[illegible]

కళాశాల స్థలం ప్రభుత్వానిదని చెబుతున్న ధృవపత్రం (ఇసి)

వ్యక్తిత్వ వికాసానికి సోపానాలు.. హాస్టళ్లు

వల్లూరు బాలికల వసతి గృహంలో అడ్మిషన్లు ప్రారంభం - హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ కెవి.నర్సమ్మ

ప్రజాశక్తి - ఆచంట

వ్యక్తిత్వ వికాస సోపానాలే సాంఘిక సంక్షేమ వసతి గృహాలని వల్లూరు సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ కెవి.నర్సమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె ప్రజాశక్తితో మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు హాస్టల్లోని విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ప్రతిరోజూ ఉదయం సాయంత్రం స్టడీ అవర్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని వల్లూరు గ్రామంలోని బాలికల హాస్టల్లో మూడో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకూ అడ్మిషన్లు జరుగుతున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ప్రతిరోజూ ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం రుచికరమైన పౌష్టికాహారం బాలికలకు అందించనున్నట్లు ఆమె తెలిపారు. మెనూలో భాగంగా ఉదయం అల్పాహారంగా పూరి, ఇడ్లీ, పులిహోర, జీరా రైస్, హాట్ పొంగల్‌తో పాటు వారంలో మూడుసార్లు కోడి మాంసం, మూడుసార్లు కోడిగుడ్లతో చక్కటి రుచికరమైన భోజనంతోపాటు ప్రతిరోజూ పాలు, స్నాక్స్ అందించనున్నట్లు ఆమె తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ ప్రతినెలా క్రమం తప్పకుండా ప్రభుత్వ వైద్యులచే ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వసతి గృహంలో విద్యార్థులకు ప్రతినెలా కాస్మోటిక్ ఛార్జీలు ఏడో తరగతి నుంచి 9వ తరగతి వరకూ రూ.200, మూడు నుంచి ఆరో తరగతి వరకూ రూ.130 విద్యార్థుల బ్యాంకు ఖాతాకు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. వసతి గృహంలో చేరిన విద్యార్థులకు ట్రంకుపెట్టె, స్టీల్ ప్లేట్, స్టీల్ గ్లాస్, నోట్ బుక్స్, జంబుఖానా దుప్పటి అందించనున్నట్లు తెలిపారు. హాస్టల్లో విద్యార్థుల మానసిక, శారీరికోల్లాసానికి వాలీబాల్, షటిల్, క్యారమ్స్, చెస్, తదితర ఆటలు ఆడించనున్నట్లు తెలిపారు.

హాస్టల్లో చేరేందుకు విద్యార్థులు తీసుకురావాల్సినవి..

విద్యార్థి, తల్లిదండ్రుల ఆధార్ కార్డు 3 జిరాక్స్ కాపీలు, తల్లిదండ్రుల రేషన్ కార్డు 3 జిరాక్స్ కాపీలు, విద్యార్థి తల్లి లేదా తండ్రి బ్యాంక్ అకౌంట్ 3 జిరాక్స్ కాపీలు. విద్యార్థి టిసి లేదా రికార్డ్ సీట్ ఒరిజినల్ 3 జిరాక్స్ కాపీలతోపాటు విద్యార్థి 3 ఫొటోలు తీసుకుని విధిగా అడ్మిషన్ తీసుకోవాలని ఆమె సూచించారు. అలాగే బాలురకు సంబంధించి ఆచంట నియోజకవర్గం పెనుమంట్ర మండలం పాలమూరు గ్రామంలో అడ్మిషన్లు జరుగుతున్నట్లు వివరించారు. మరిన్ని వివరాల కోసం హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ కెవి నర్సమ్మ 9014120749 నంబరును సంప్రదించాలని ఆమె కోరారు.

రైతులు ఆర్థిక పరిపుష్టి సాధించాలి

ప్రజాశక్తి - ఆచంట

రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతుల కోసం ఏర్పాటు చేసిన పంట సాగుదారుడు హక్కు చట్టం కార్డులను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచి కోట సరోజిని వెంకటేశ్వర రావు అన్నారు. పంట సాగుదారుడు హక్కు చట్టం కార్డులపై ఆచంట, శేషమ్మచెరువు, పెనుమంచిలి గ్రామాల్లో అవగాహనా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయా గ్రామాల సర్పంచులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కౌలు రైతులందరికీ వైఎస్ఆర్ రైతు భరోసా కింద సంవత్సరానికి రూ.13,500 ప్రభుత్వం అందజేస్తోందని, దీన్ని కౌలు రైతులందరూ సద్వినియోగం చేసుకొని ఆర్థిక పరిపుష్టి పొందాలని ఆమె సూచించారు. తహశీల్దార్ ఎస్.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కౌలు రైతులందరూ త్వరితగతిన తమ దరఖాస్తులను గ్రామ కమిటీకి అందజేయాలని కోరారు. మండల విస్తరణ అధికారి బి.నాగరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఛైర్ పర్సన్ పెచ్చెట్టి సత్యనారాయణ, కార్యదర్శి పారుపల్లి యేసు రత్నం, సర్పంచులు జక్కం శెట్టి శ్రీరాములు, గణేశుల శేషవాణి సుబ్బారావు, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సర్పంచ్ కోట సరోజినీ వెంకటేశ్వరరావు

పెండింగ్ క్లయిముల పరిష్కారానికి చర్యలు

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఫామ్ 6, 7, 8 క్లయిమ్‌లను త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. విజయవాడ నుంచి శుక్రవారం ఇఆర్‌ఒ నెట్, ఇవిఎం గోడౌన్లు, ఎపిక్ కార్డుల పంపిణీ, ఇపి కేసులు, ఎస్‌ఒపిలు, వివిధ అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి, డిఆర్‌ఒ కె.కృష్ణవేణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఫామ్ 6 క్లయిమ్‌లకు సంబంధించి 5,800 ఫామ్స్ రాగా, 862 ఫామ్స్ పెండింగ్ ఉన్నాయని, వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. ఫామ్-7 క్లెయిములకు సంబంధించి 2,549 ఫామ్స్ రాగా, 241 ఫామ్స్ పెండింగ్ ఉన్నాయని, ఫామ్-8 క్లయిమ్‌లకు సంబంధించి 1,895 ఫామ్స్ రాగా, 354 ఫామ్స్ పెండింగ్ ఉన్నాయని, వాటిని త్వరగా పరిష్కరిస్తామని వివరించారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో నరసాపురం సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, ఆర్‌డిఒ దాసి రాజు, ఆర్‌ఒలు, ఇఆర్‌ఒలు పాల్గొన్నారు.

పూడికతీత పనుల పరిశీలన

ప్రజాశక్తి - ఉండి

గ్రామంలోని బిసిలకు చెందిన మంచినీటి చెరువును గ్రామ పంచాయతీ పెద్దలు పట్టించుకోకపోవడంతో గ్రామస్తులే బాగు చేయించుకుంటున్నామని పెదపుల్లేరు గ్రామ బిసి నాయకులు గేదెల నరసింహులు, రాయి శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం పెదపుల్లేరు గ్రామ శివారు బిసి కులానికి చెందిన మంచినీటి చెరువును గేదెల నరసింహులు, రాయి శ్రీనివాస్ దగ్గరుండి పూడికతీత పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ప్రతి గ్రామంలోనూ బీసీలకు, దళితులకు, అగ్ర కులస్తులకు వేర్వేరుగా తాగునీటి చెరువులు ఉండేవన్నారు. బీసీలకు చెందిన మంచినీటి చెరువు ఇటీవల పూర్తిగా కలుషితమైపోయి చెత్తాచెదారంతో నిండిపోయిందని తెలిపారు. పంచాయతీ పాలకవర్గం పట్టించుకోకపోవడంతో తామే దగ్గరుండి పూడికతీత పనులు చేయించి చెరువును వాడుకలోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నట్లు వారు తెలిపారు.

మాగంటి బాబును పరామర్శిస్తున్న టిడిపి నేతలు

మాగంటి బాబుకు టిడిపి నేతల పరామర్శ

ప్రజాశక్తి - పాలకొల్లు

మాజీ పార్లమెంట్ సభ్యులు మాగంటి బాబు ఇటీవల కాలికి ఆపరేషన్ చేయించుకున్నారు. ఆయనను శుక్రవారం మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు పరామర్శించారు. రాష్ట్రంలో తాజా రాజకీయాలపై చర్చించారు. చించినాడలో జరుగుతున్న అక్రమ తవ్వకాల గురించి మాగంటి బాబు అడిగి ప్రభుత్వ వైఖరిని తప్పుపట్టారు.

కళాకారుడికి వసుధ వైద్య సహాయం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పట్టణంలోని చినరంగనిపాలేనికి చెందిన ప్రముఖ కళాకారుడు పూలఖండం ప్రభాకరరావుకు వసుధ ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన వెంకటరామరాజు రూ.పది వేల చెక్కు అందజేశారు. వసుధ ఫౌండేషన్ కార్యాలయంలో కార్యదర్శి మంతెన కృష్ణంరాజు, కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు చేతుల మీదుగా ఆర్థిక సహాయాన్ని ప్రభాకరరావుకు శుక్రవారం అందించారు .ఇటీవల ప్రభాకరరావు గుండెకు సంబంధించి శస్త్ర చికిత్స చేయించుకున్నారు.

సంపూర్ణ పారిశుధ్య పల్లెలే లక్ష్యం

ప్రజాశక్తి - కాళ్ల

డంపింగ్ యార్డ్‌ను పరిశీలిస్తున్న డిపిఒ మల్లికార్జునరావు

పారిశుధ్య పల్లెలే లక్ష్యంగా చెత్త సేకరణపై మరింత దృష్టి సారిస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి జివిఆర్‌కె.మల్లికార్జునరావు తెలిపారు. పెదఅమిరం గ్రామంలో డిపిఒ మల్లికార్జునరావు శుక్రవారం పర్యటించారు. పంచాయతీ అధికారి మల్లికార్జునరావుకు గ్రామ సర్పంచి డొక్కు సోమేశ్వరరావు పుష్పగుచ్ఛం అందజేశారు. పెదఅమిరం గ్రామ సచివాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. గ్రామంలో ఉన్న డంపింగ్ యార్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్త సేకరణతో సంపద తయారీపై దృష్టి సారించామన్నారు. కాలువల ద్వారా నీటి సరఫరా వస్తున్న దృష్ట్యా గ్రామాల్లో మంచినీటి చెరువులు నింపుకోవాలన్నారు. జిల్లాల్లో పలు గ్రామాల్లో పరిశుభ్రతకు ప్రభుత్వం తడి, పొడి చెత్త సేకరణకు పెద్దఎత్తున చర్యలు చేపట్టిందన్నారు. పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామన్నారు. డిపిఒ వెంట గ్రామ సర్పంచి డొక్కు సోమేశ్వరరావు, ఉపసర్పంచి జవ్వాది కిషోర్, గ్రామ కార్యదర్శి పి.కనకారావు, సచివాలయ కార్యదర్శి సత్యనారాయణ, తంగేళ్ల జయకృష్ణ, నడింపల్లి సుబ్బరాజు పాల్గొన్నారు.

మాణిక్యాలరావుకు డాక్టరేట్

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

వైఎన్ కళాశాల, సిఎస్.రావు పీజీ సెంటర్ ఎంబిఎ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న మంద మాణిక్యాలరావుకు ఆచార్య నాగార్జునా యూనివర్సిటీ గుంటూరు వారు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. నరసాపురం, పరిసర ప్రాంతాల్లోని లేస్ క్లస్టర్స్‌లో పని చేస్తున్న మహిళల పని పరిస్థితులు, వారి జీవన విధానం (హెచ్‌ఆర్ ప్రాక్టీసు అమొంగ్ హ్యాండీక్రాఫ్ట్స్ క్రోచేట్ లేస్ విమెన్ ఆర్టిసంన్) అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆయనను వైఎన్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చినమిల్లి సత్యనారాయణరావు, అటానమస్ గవర్నింగ్ బాడీ మెంబర్ ఆర్‌వి.సుబ్బారావు, ప్రిన్సిపల్ ఎపివి.అప్పారావు తదితరులు అభినందించారు.

ఎంఎల్‌సిని కలిసిన తహశీల్దార్ సునీల్‌కుమార్

ప్రజాశక్తి - పాలకొల్లు

యలమంచిలి మండల తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన మాతా సునీల్‌కుమార్ శుక్రవారం పాలకొల్లు వైసిపి కార్యాలయంలో ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలోని రెవెన్యూ, జగనన్న కాలనీల్లో సమస్యలు గురించి వారు చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రావూరి వెంకటరమణ, బుజ్జీ, కడలి నరసింహారావు పాల్గొన్నారు.

30న నరసాపురం బార్ అసోసియేషన్ ఎన్నికలు

నరసాపురం టౌన్ :గతంలో వాయిదా పడిన నరసాపురం న్యాయవాదుల సంఘం కార్యవర్గ ఎన్నికలు తిరిగి ఈ నెల 30వ తేదీన నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి, న్యాయవాది పూరిళ్ల శ్రీనివాస్, నిర్వహణ కమిటీ సభ్యులైన న్యాయవాదులు ఉల్లంపర్తి సత్యనారాయణ, కొల్లాటి ఆదినారాయణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించారు. ఈ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నుంచి ఈ నెల 20 తేదీన నామినేషన్ పత్రాలను స్వీకరిస్తామన్నారు. 21వ తేదీన నామినేషన్ పత్రాలను పరిశీలించి అర్హులైన అభ్యర్థుల పేర్లను ప్రకటిస్తామని తెలిపారు. ఈ నెల 22వ తేదీ నుంచి 24వ తేదీ వరకూ నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుందని వివరించారు. ఎన్నికలను ఈ నెల 30 వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకూ నిర్వహిస్తామన్నారు. అదేరోజు సాయంత్రం ఓట్లను లెక్కించి ఫలితాలను కూడా వెల్లడిస్తామని వారు తెలిపారు.

పాస్‌పోర్టు పోయినది

కంకటాల ప్రసాద రావు, తండ్రి: సుబ్బారావు అను నేను నాయొక్క పాస్‌పోర్టు పడిపోయింది. పాత ఇంటి నుండి కొత్త ఇంటికి వెళుతుండగా నాయొక్క పాస్‌పోర్టు పడిపోయినది. **పాస్‌పోర్టు నెంబర్: L4388683** గల పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన ఎడల ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

కంకటాల ప్రసాద రావు
తండ్రి: సుబ్బారావు, డో.నెం.3-79, వెలగలేరు. పెనుమంట్ర మండలం, ప॥గో॥జిల్లా, పిన్: 534123. సెల్: 76809 32687

పాస్‌పోర్ట్ పోయినది

ఉంగుటూరు మండలం, రావులపర్రు గ్రామంకు చెందిన ధనుకొండ వెంకట లక్ష్మీ, భర్త: మల్లేశ్వర రావు (ఆధార్ నెంబర్ 8603 3757 6699) తెలియజేయునది ఏమనగా.., ది.09-05-2023న నా ఒరిజినల్ పాస్‌పోర్టు (నేను వైజాగ్‌లో పొందిన **(S1579658)** జిరాక్స్ కాపీలు తీసుకునే నిమిత్తం ఆటోలో మా ఇంటి నుంచి ఉంగుటూరు వెళుతుండగా నా పాస్‌పోర్టు ఇతర డాక్యుమెంట్స్ ఉన్న సంచి దారిలో పడిపోయినవి. దారి పొడవునా ఎంత వెతికినా కనిపించలేదు. నా ఒరిజినల్ పాస్‌పోర్టు ఇతర డాక్యుమెంట్లు ఎవరికైనా దొరికితే నాకు ఈ నెంబర్‌కు తెలియ పరచగలరు.

ధనుకొండ వెంకట లక్ష్మీ
భర్త: మల్లేశ్వర రావు, ఫ్లాట్ నెం 313, రావులపర్రు, వెస్ట్ విపర్రు పోస్ట్, ఉంగుటూరు మండలం సెల్: 63038 15399, 99512 90934

లింకు దస్తావేజులు పోయినవి

వల్లూరి సత్యవాణి, భర్త: ప్రకాష్ దత్ గారి ఒరిజినల్ ఇంటి లింకు దస్తావేజులు నెం. 1803/2012, 1784/2012 గల దస్తావేజులు పోయినవి. పాలంగి గ్రామంలో ఇల్లు కలదు. ఇంటి దస్తావేజులకు సంబంధించిన లింకు దస్తావేజులు 16వ తేదీన జిరాక్సు తీసుకొనుటకు వెళ్ళుచుండగా మార్గ మధ్యంలో పడిపోయినవి. చుట్టుప్రక్కల ఎంత వెతికినా దొరికలేదు. ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింది అడ్రసుకు అందించగలరు.

పార్టీ వివరములు
డో.నెం. 20-1-57, బాయ్స్ హైస్కూల్ ఎదురుగా, తణుకు, తణుకు మండలం, ప॥గో॥జిల్లా.

పొట్ల సురేష్
అడ్వకేట్, సెల్: 90325 73947

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సెకెండ్ ఎడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి-కం సెకెండ్ ఎడిషినల్ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు
ఓ.ఎస్.నెం. 543/2019

వాది: అది రఘురామ్
ప్రతివాది: సంబలదీవి సునీత

వాది తరుపున దాఖలు చేసుకున్న పేపరు ప్రకటన

పై నెంబరు గల దావాలో ప్రతివాది అయిన మీరు దావా సమన్లు శ్రీ కోర్టు వారి ద్వారా మరియు రిజిష్టరు పోస్టు ద్వారా పలుమార్లు పంపిననూ అవి మీరు తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నందున మీరు పై కోర్టు వారి ఎదుట **ది.22-06-2023వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు స్వయంగా గాని, మీ తరుపున ప్లీడరు గారి ద్వారా గాని హాజరై అభ్యంతరములు ఉన్న ఎడల తెలియజేసుకొనవలెను.** లేని ఎడల మీ పరోక్షమున తీర్పును తీర్మానించబడును అని మీకు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

పంతం వి.వి.సత్యనారాయణ
అడ్వకేట్, తాడేపల్లిగూడెం.
సెల్: 97013 55773